## క్లుప్తంగా

### రైతులు సభ్యత్వాన్ని రెన్యూవల్ చేసుకోవాలి

**కోడుమూరు రూరల్:** కోడుమూరు సహకార పరపతి సంఘంలో రుణం తీసుకున్న రైతులు తమ సభ్యత్వాన్ని రెన్యూవల్ చేసుకోవాలని సంఘం సీఈఓ ఉదయ్‌కుమార్ రెడ్డి సూచించారు. అయన ఆదివారం అయన స్థానిక సహకార సంఘం కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ.. రైతులకు సంబంధించిన వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయడం జరుగుతుందన్నారు. తమ సభ్యత్వాలు యథావిధిగా కొనసాగాలంటే ఆయా రైతులు తమకు సంబంధించిన పొలం, సహకార సంఘం పాసుపుస్తకాలు, ఆధార్, పాన్ కార్డుల జిరాక్స్‌తో పాటు రెండు ఫొటోలను సహకార సిబ్బందికి అందజేయాలని సీఈఓ సూచించారు. ఆధారాలు అందజేయని రైతులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందజేసే సబ్సిడీలు వర్తించవని, ప్రతి రైతు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సీఈఓ కోరారు.

### కాంగ్రెస్ నాయకుడి మృతి



ధరణిపోగు విక్రమ్‌కుమార్ (ఫైల్)

**సి.బెళగల్:** మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు ధరణిపోగు విక్రమ్‌కుమార్ (42) గుండెపోటుతో మరణించారు. ఆదివారం ఉదయం ఛాతీలో నొప్పిగా ఉందని విక్రమ్‌కుమార్ కుటుంబ సభ్యులకు చెప్పారు. అంబులెన్స్‌లో కర్నూలులోని ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గం మధ్యలోనే ప్రాణాలు వదిలినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. మృతుడు విక్రమ్‌కుమార్ తన దగ్గరకు వచ్చిన వారి సమస్యలు పరిష్కరించడంలో మండల, నియోజకవర్గ ప్రజలకు సూపరిచితుడు. అతని మృతి విషయాన్ని తెలుసుకున్న కోడుమూరు మాజీ ఎమ్మెల్యే మురళీకృష్ణ గ్రామానికి చేరుకుని మృతదేహంపై పూలమాల ఉంచి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. మృతుడికి భార్య నాగలక్ష్మి, ఇద్దరు కుమారులు సంతానం ఉన్నారు. విక్రమ్‌కుమార్ అంత్యక్రియలు సోమవారం సి.బెళగల్లో నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

### పాఠ్యపుస్తకాల పంపిణీ

**పాణ్యం:** మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలకు పాఠ్యపుస్తకాల పంపిణీ దాదాపు పూర్తి కావస్తోందని ఎంఈఓ–2 సుబ్రమణ్యం తెలిపారు. మండలానికి 35,445 పాఠ్య పుస్తకాలు, 32,284 నోట్ పుస్తకాలు మంజూరైనట్లు వెల్లడించారు. మండల కేంద్రం నుంచి ఆయా పాఠశాలలకు ఆటోల ద్వారా సరఫరా చేసినట్లు తెలిపారు. మిగిలిన పుస్తకాలు రాగానే అందజేస్తామన్నారు.

### నేడు ఈద్గాల్లో ప్రత్యేక ప్రార్థనలు

**పాణ్యం:** బక్రీద్ పర్వదినాన్ని పురస్కరించుకుని ఈద్గాల్లో ప్రార్థనలు చేయడానికి నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. మండల కేంద్రం పాణ్యంలోని ఎంపీడీఓ కార్యాలయం పక్కన ఉన్న ఈద్గాలో నిర్వహకులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఉదయం 8.30 గంటలకు ప్రార్థనలు ప్రారంభమవుతాయని మత పెద్దలు తెలిపారు.

### నగరంలో నేడు ట్రాఫిక్ మళ్లింపు

**కర్నూలు:** బక్రీద్ పండును పురస్కరించుకొని సోమవారం కర్నూలు నగరంలో ప్రధాన రహదారుల్లో ట్రాఫిక్‌ను మళ్లిస్తున్నట్లు ట్రాఫిక్ సీఐ పి.గౌతమి ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. ముస్లిం సోదరులు ప్రార్థన చేసుకోడానికి ఎలాంటి ఇబ్బంది లేకుండా సోమవారం ఉదయం 6 గంటల నుంచి ప్రార్థనలు ముగిసే వరకు ట్రాఫిక్ మళ్లింపు కొనసాగుతుందని పేర్కొన్నారు. హైదరాబాద్ నుంచి వచ్చే ఆర్టీసీ బస్సులను తుంగభద్ర బ్రిడ్జి వద్ద నుంచి తిప్పమ్మ కొట్టం నుంచి జాతీయ రహదారిపై వెళ్లేలా ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. అలాగే బస్టాండ్ నుంచి ఇతర ప్రాంతాలకు వెళ్లే బస్సులు బళ్లారి చౌరస్తా మీదుగా గుత్తి పెట్రోల్ బంక్, బిర్లా జంక్షన్, సీ క్యాంప్ మీదుగా నంద్యాల, నందికొట్కూరు వైపు వెళ్లేలా ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు. నంద్యాల వైపు నుంచి వచ్చే ఆర్టీసీ బస్సులు, ఇతర వాహనాలు మద్దూరు నగర్, బిర్లా జంక్షన్, గుత్తి పెట్రోల్ బంక్ మీదుగా ఆర్టీసీ బస్టాండ్‌కు చేరుకునేలా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ప్రయాణికులు పోలీస్‌లకు సహకరించాలని కోరారు.

### వైవిధ్యమైన కవితా శిల్పం 'బాల్యమే శరణార్థి'

**కర్నూలు కల్చరల్:** వైవిధ్యమైన కవితా శిల్పంతో 'బాల్యమే శరణార్థి' పుస్తకాన్ని కవి రత్నం యేసేపు రచించారని సాహితీ స్రవంతి రాష్ట్ర అధ్యక్షుడు కెంగార మోహన్ అన్నారు. ఉద్యగ క్రాంతి ప్రచురణల ఆధ్వర్యంలో బాల్యమే శరణార్థి పుస్తకావిష్కరణ సభ ఆదివారం సీక్యాంప్ టీజీవీ కళాక్షేత్రంలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మనిషిని, సమాజాన్ని చదవలేని జ్ఞానం విజ్ఞానం కాదని, మనిషిలోని మనస్సుని, మానవీయతను వెలికి తీయని పాఠం శాస్త్రీయం కాదని కవి తన కవిత్వంలో చెప్పారన్నారు. సామాజిక స్పృహలేని ఉపాధ్యాయులు ఈ సమాజంలో ఉన్నారని చెబుతూనే పిల్లలు ఈ సమాజంలో బతక గలిగే పాఠాలు నేర్పేవాళ్లు కావాలన్నారు. కేఎన్‌పీఎస్ జిల్లా అధ్యక్షులు సుబ్బారాయుడు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో విరసం నాయకులు పాణి, నాగేశ్వరాచారి, సాహితీ స్రవంతి రాష్ట్ర కార్యదర్శి సంధ్యాల రఘుబాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఆవుల చక్రపాణి యాదవ్, యూటీఎఫ్ నాయకులు రాములు, రాయలసీమ మేధావుల సంఘం నాయకులు రవి ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.



పండుగ సందడి.. కొనుగోళ్లతో కిక్కిరిసిన పూలబజార్ ప్రాంతం

## ఈద్ ముబారక్

నగరంలో ఎక్కడ చూసినా బక్రీద్ పండుగ సందడి కనిపిస్తోంది. పిండి పదార్థాలు, డ్రైఫ్రూట్స్, కొత్తబట్టలు, అలంకరణవస్తువుల కొనుగోళ్లతో ఆదివారం పాతబస్తీ కిటకిటలాడింది. పొట్టేళ్ల అమ్మకాలు సైతం జోరుగా సాగాయి. హజరత్ ఇబ్రహీం త్యాగనిరతికి ప్రతీకగా ముస్లింలు ఈ వేడుకను జరుపుకుంటారు.

– సాక్షి, ఫొటోగ్రాఫర్, కర్నూలు



సేమియ విక్రయాలు



నూతన వస్త్రాల కొనుగోళ్లు



నగరంలో పొట్టేళ్ల అమ్మకాలు



పాతబస్తీలో గాజులు కొనుగోలు చేస్తున్న ముస్లిం మహిళలు



డ్రైఫ్రూట్స్ అమ్మకాలు



కిటకిటలాడుతున్న మెహందీ కోన్ల దుకాణం

# త్యాగానికి ప్రతీక బక్రీద్

- నేడు ఈదుల్ అజ్హా ప్రత్యేక నమాజ్
- ఈద్గాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేసిన నిర్వాహకులు

**గడివేముల:** ముస్లింల పర్వదినమైన బక్రీద్ (ఈదుల్ అజ్హా)ను త్యాగానికి ప్రతీకగా జరుపుకుంటారు. బక్రీద్ అంటే బకర్ ఈద్ అని అర్థం. బకర్ అంటే జంతువు, ఈద్ అంటే పండుగ. జంతువును ఖుర్బానీ ఇచ్చే పండుగ కాబట్టి దీనిని ఈదుల్ ఖుర్బానీ అని కూడా అంటారు. త్యాగనిరతతో పాటు మనోవాంఛ, స్వార్థం, అసూయ, రాగ ద్వేషాలను విడిచిపెట్టి మానవతను వెదజల్లాలన్నదే బక్రీద్ పండుగ ఆంతర్యం.



గడివేముల ఈద్గాలో ప్రత్యేక పార్థనలు చేస్తున్న ముస్లింలు (ఫైల్)

**బక్రీద్ విశిష్టత**

ఖురాన్ ప్రకారం భూమిపై అల్లాహ్ ప్రవక్తల్లో ఇబ్రహీం ఒకరు. ఆయన మక్కా పట్టణాన్ని నిర్మించారు. ప్రార్థనల కోసం కాబా అనే ప్రార్థనా మందిరాన్ని నిర్మించి దైవ ప్రవక్తగా నిలిచారు. ఇబ్రహీంకు లేకలేక కలిగిన సంతానం ఇస్మాయిల్. ఇబ్రహీంను అల్లాహ్ పలు రకాలుగా పరీక్షిస్తాడు. అందులో భాగంగా ఒక రోజు కలలో తన కుమారుడు ఇస్మాయిల్ మెడపై కత్తితో కోస్తున్నట్లు కలొచ్చింది. అల్లాహ్ ఖుర్బానీ కోరుతున్నాడని ఒంటెను బలి ఇస్తాడు. మళ్లీ అదే కల రావడంతో ఇస్మాయిల్‌ను అల్లాహ్ బలి కోరుతున్నాడని భావించి కొడుకును బలి ఇవ్వబోతాడు. ఆ త్యాగాన్ని మెచ్చిన అల్లాహ్.. ఇస్మాయిల్ స్థానంలో ఓ జీవాన్ని బలి ఇవ్వమని జిబ్రాయిల్ అనే దూత ద్వారా ఇబ్రహీంకు తెలియజేస్తాడు. అప్పటి నుంచి బక్రీద్ పండుగ రోజున జీవాన్ని బలి ఇవ్వడం అనవాయితీగా వస్తోంది.

### ఖుర్బానీ ఇవ్వడం అనవాయితీ



బక్రీద్ సందర్భంగా ముస్లింలు పొట్టేలు మాంసాన్ని ఖుర్బానీ ఇచ్చి పేదలకు పంచడం అనవాయితీ. ముస్లింలు తమ జీవితకాలంలో ఒక్కసారైనా అతి పవిత్రమైన మక్కాను సందర్శించి ముక్తిని పొందాలి. – షేక్ అబ్దుల్ రహమాన్, ప్రభుత్వ ఖాజీ, గడివేముల

**ఖుర్బానీకి ప్రాధాన్యం**

ముస్లింలు సోమవారం బక్రీద్ పండుగను జరుపుకోనున్నారు. ఇందులో భాగంగా ఖుర్బానీ ఇవ్వడం అత్యంత పవిత్రమైన కార్యక్రమంగా భావిస్తారు. ఒక పొట్టేలు మాంసాన్ని మూడు భాగాలుగా చేస్తారు. ఒక భాగాన్ని నిరుపేదలకు పంచి పెడతారు. మిగిలిన భాగాల్లో రెండో దాన్ని బంధువులకు, మూడో భాగాన్ని తమ కోసం ఉంచుకుంటారు. దీన్నే ఖుర్బానీ అంటారు. ముస్లింలు ఈ మాసంలోనే హజ్ యాత్ర చేపడతారు. పవిత్ర మక్కాను సందర్శించడానికి వెళతారు. సౌదీ అరేబియాలోని మక్కా నగరంలోని మస్జిద్ అల్ హరామ్‌లోని కాబా చుట్టూ ఏడు సార్లు ప్రదక్షిణాలు చేస్తారు. బక్రీద్ రోజు ముస్లింలు అందరూ ఈద్ గాహు చేరుకుని సామూహిక ప్రార్థనలు నిర్వహిస్తారు.

### 22న కర్నూలులో 'ఒలింపిక్' పరుగు

**కర్నూలు (టౌన్):** నగరంలో ఈ నెల 22వ తేదీన ఒలింపిక్ డే పరుగు నిర్వహిస్తున్నట్లు జిల్లా ఒలింపిక్ సంఘం ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు తెలిపారు. ఒలింపిక్ డేను పురస్కరించుకొని ఆదివారం ఒలింపిక్ సంఘం, క్రీడా సంఘాల సంయుక్త ఆధ్వర్యంలో విద్యార్థినీ, విద్యార్థులకు అంతర్ పాఠశాలల క్రీడా పోటీలు నిర్వహించారు. స్థానిక స్పోర్ట్స్ అథారిటీకి చెందిన స్విమ్మింగ్ పూల్‌లో అంతర్ పాఠశాలల స్విమ్మింగ్ పోటీల ప్రారంభ కార్యక్రమంలో ఆయనతో పాటు క్రైడాయి ఉపాధ్యక్షులు సురేష్‌కుమార్, బ్రిజేష్ సింగ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఒలింపిక్ డే సందర్భంగా విద్యార్థినీ, విద్యార్థులకు పోటీలు నిర్వహించడం మంచి పరిణామమన్నారు. క్రీడా పోటీలకు తమ వంతు సహకారం అందిస్తామన్నారు. జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతి రావు, స్విమ్మింగ్ శిక్షకులు నటరాజ్ పాల్గొన్నారు.

**ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో...**

స్థానిక పెద్ద మార్కెట్‌లోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో ఆదివారం ఒలింపిక్ డేను పురస్కరించుకొని ఉషూ పోటీలు నిర్వహించారు. పోటీలను ఒలింపిక్ సంఘం ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒలింపిక్ డే సంబరాల్లో భాగంగా అన్ని క్రీడాంశాల్లో క్రీడాకారులకు పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. ఉషూ సంఘం కార్యదర్శి శ్రీనివాసులు పాల్గొన్నారు.


## మెలకువలతో పత్తిలో అధిక దిగుబడి

- ఏఓ శ్రీనివాసరెడ్డి

**కల్లూరు:** పత్తి సాగులో సాధారణ పద్ధతితో పోల్చుకుంటే అధిక సాంద్రత పద్ధతి విధానంలో (హెచ్‌డీసీపీ) సాగు చేయడం వల్ల అధిక దిగుబడి వస్తుందని మండల వ్యవసాయ అధికారి శ్రీనివాసరెడ్డి అన్నారు. ఆదివారం కల్లూరు మండలం పందిపాడు గ్రామానికి చెందిన కె. పెద్ద మద్దిలేటి అనే రైతు పొలంలో వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ (ఆత్మ) ప్రదర్శన క్షేత్రంలో భాగంగా హెచ్‌డీసీపీ పద్ధతిలో పత్తి విత్తనాలు నాటారు. రైతుకు పత్తి విత్తనాలు, మొక్క పెరుగుదల నిరోధక మందులు, పురుగు మందులను అధికారులు అందించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ.. పత్తిలో సాధారణ పద్ధతిలో కంటే ఈ విధానంలో 30 శాతం అధిక దిగుబడి వస్తుందన్నారు. పంట కాలాన్ని కూడా తగ్గించుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ బి.టి.ఎం.ఆర్ చక్రవర్తి నాయక్, వీఏఏ వీర నారాయణ, గ్రామ రైతులు పాల్గొన్నారు.



రైతుకు మందులు అందిస్తున్న వ్యవసాయ అధికారులు



కర్నూలు శివారులో జరుగుతున్న టన్నెల్ పనులు

### వేగంగా టన్నెల్ పనులు

చెన్నై నుంచి సూరత్‌కు నిర్మిస్తున్న జాతీయ రహదారి పనులు వేగంగా జరుగుతున్నాయి. అందులో భాగంగా కర్నూలు నగర శివారులోని 44వ జాతీయ రహదారి రింగ్ రోడ్డు దగ్గర టన్నెల్ పనులు జోరందుకున్నాయి. – కల్లూరు

### మెడికల్ కాలేజీ అధికారులకు బెదిరింపు!

- మైదానాన్ని తెరవాలని హుకూం

**కర్నూలు(హాస్పిటల్):** తాజాగా ఎన్నికైన ఓ ప్రజాప్రతినిధి మెడికల్ కాలేజీ అధికారులకు ఫోన్ చేసి బెదిరించినట్లు సమాచారం. కర్నూలు మెడికల్ కాలేజీ మైదానాన్ని తెరవాలని హుకూం జారీ చేసినట్లు తెలుస్తోంది. ఈ మైదానంలో వాకర్స్‌కు అనుమతి నిరాకరిస్తూ కొన్ని సంవత్సరాలుగా కళాశాల అధికారులు నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు కళాశాల అభివృద్ధి కమిటీలో తీర్మానం చేశారు. వాకర్స్ పేరుతో కొందరు బయటి వ్యక్తులు వచ్చి అసాంఘిక చర్యలు పాల్పడుతున్నారు. అలాగే మైదానాన్ని ఆక్రమించేందుకు ప్రయత్నించారు. పూర్వ విద్యార్థుల పేరిట జరిగే నిర్మాణాన్ని కూడా అడ్డుకున్నారు. ఎవ్వరికైనా అనుమతి ఇస్తే కళాశాల మైదానాన్ని క్రమంగా ఆక్రమించుకుంటారని కమిటీలో కొందరు అభిప్రాయపడినట్లు తెలిసింది. దీంతో కొన్ని సంవత్సరాల నుంచి కళాశాల మైదానానికి తాళం వేసి ఉంచారు. మైదానం తెరిచి ఉంచాలని గతంలోనూ పలువురు ప్రజాప్రతినిధులు అధికారులకు ఫోన్ చేసి చెప్పారు. వారికి వాస్తవ పరిస్థితి వివరించడంతో అధికారుల మాటకు విలువిచ్చారు. అయితే తాజాగా ఎన్నికైన ఓ ప్రజాప్రతినిధి మైదానం తెరవాలని, వాకర్స్‌కు అనుమతి ఇవ్వాలని ఆదేశాలు జారీ చేశారు. మైదానం తెరవడం వల్ల జరిగే నష్టాల గురించి వివరించినా సదరు ప్రజాప్రతినిధి వినలేదని తెలుస్తోంది. ముందు ఎప్పటి నుంచి తెరుస్తారో ఆ మాట మాత్రం చెప్పాలంటూ హూంకరించినట్లు సమాచారం. దీంతో తాము కమిటీతో చర్చించి చెబుతామంటూ అధికారులు తేల్చి చెప్పినట్లు తెలిసింది.

## సాగు, తాగునీటి సమస్యల పరిష్కారానికి కృషి

**కోడుమూరు రూరల్:** కోడుమూరు నియోజకవర్గంలో సాగు, తాగునీటి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి అన్నారు. ఆయన ఆదివారం కోడుమూరులోని మేజర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ప్రభుత్వంతో మాట్లాడి వేదవతి, గుండ్రేవుల ప్రాజెక్టులను సాధించి జిల్లా రైతులకు సాగునీటినందిస్తామన్నారు. సమ్మర్ స్టోరేజీ ట్యాంకు ఏర్పాటుకు స్థలదాతలు ముందుకొస్తే గాజుల దిన్నె ప్రాజెక్టు నుంచి పైపులైన్ ద్వారా నీటిని తీసుకొచ్చి కోడుమూరు ప్రజలకు శాశ్వతంగా నీటి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. కార్యకర్తలకు ఎల్లవేళలా అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. అంతకుముందు.. డోన్ ఎమ్మెల్యేగా గెలిచి మొదటిసారిగా కోడుమూరుకు విచ్చేసిన కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డికి స్థానిక టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా స్వాగతం పలికి పూలమాలలతో సత్కరించారు. గ్రామ సర్పంచ్ భాగ్యరత్న, టీడీపీ మండల కన్వీనర్ కోట్ల కవితమ్మ, నాయకులు సీబీ.లత, కేతః రాంబాబు, హేమాద్రిరెడ్డి, మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి

## ఫీజుల దోపిడీని అరికట్టడంలో విఫలం



మాట్లాడుతున్న ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు సోమన్న

**కోడుమూరు రూరల్:** ప్రైవేట్ పాఠశాలల అధిక ఫీజుల దోపిడీని అరికట్టడంలో కోడుమూరు మండల విద్యాశాఖాధికారులు ఘోరంగా విఫలమయ్యారని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు సోమన్న ఆరోపించారు. కోడుమూరులోని సీపీఐ కార్యాలయంలో ఆదివారం ఏఐఎస్ఎఫ్ మండల నాయకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సోమన్న మాట్లాడుతూ.. మండలంలో ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యం ఇష్టానుసారంగా ఫీజులను పెంచేయడంతో పాటు, పాఠశాలల్లోనే దుకాణాలను తెరచి పుస్తకాల అమ్మకాల పేరుతో వేలాది రూపాయలు పిల్లల తల్లిదండ్రుల నుంచి దోచుకుంటున్నా మండల విద్యాశాఖాధికారులు మాత్రం పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. కోడుమూరులో బీసీ విద్యార్థులకు హాస్టల్ వసతి లేకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే బీసీ బాలుర వసతి గృహాన్ని ఏర్పాటు చేయాలని, మోడల్ స్కూల్‌కు రోడ్డును ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ప్రైవేట్ పాఠశాలల ఫీజుల దోపిడీని అరికట్టకపోతే స్థానిక ఎంఈఓ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. సమావేశంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి రంగస్వామి, స్థానిక నాయకులు సిద్ధు, మహమ్మద్ ఆజాం, మోఫిత్, షేక్షావలి తదితరులున్నారు.

## పూల సాగును ప్రోత్సహించండి

- సంప్రదాయ పంటల స్థానంలో పూల సాగుతో రాణించవచ్చు
- డిమాండ్, మార్కెటింగ్‌ను దృష్టిలో ఉంచుకొని పూల సాగు చేపట్టాలి
- ఉద్యాన అధికారి మధన్‌మోహన్‌గౌడు సూచనలు

**కర్నూలు(అగ్రికల్చర్):** జిల్లాలో పూలతోటల అభివృద్ధికి చక్కటి అవకాశాలు ఉన్నాయని, సంప్రదాయ పంటల స్థానంలో పండ్లతోటల సాగును ప్రోత్సహించడంపై దృష్టి సారించాలని ఉద్యాన అధికారి మధన్‌మోహన్‌గౌడ్ ఇన్‌పుట్ డీలర్లకు సూచించారు. ఆదివారం వ్యవసాయ శాఖ కర్నూలు ఏడీఏ కార్యాలయంలో దేశీ డిప్లొమ కోర్సుపై ఇన్‌పుట్ డీలర్లకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉద్యాన అధికారి పాల్గొని పూల తోటల అభివృద్ధి ఆవశ్యకతను వివరించారు. పూల తోటల్లో ముఖ్యంగా చామంతి, మల్లె, కనకాంబరాలు, బంతిపూలు సాగు చేసుకోవచ్చని పేర్కొన్నారు. పూల సాగులో పాటించాల్సిన మెళకువలపై అవగాహన కల్పించారు. రైతులు ప్రతి అవసరానికి ఇన్‌పుట్ డీలర్లనే ఆశ్రయిస్తుంటారని, వారికి పూల సాగుపై అవగాహన పెంచాలని పేర్కొన్నారు. మార్కెట్‌లో ఉన్న డిమాండ్ దృష్టిలో ఉంచుకొని పూల సాగు చేపట్టాలని తెలిపారు. పూలతోటలకు ప్రధానంగా సూక్ష్మపోషకాల లోపాలు ఎక్కువగా కనబడుతాయని, మొగ్గదశలో బోరాన్, మెగ్నీషియం పిచికారీ చేస్తే పూల దిగుబడి పెరుగుతుందని, తద్వారా రైతులకు ఆదాయం వస్తుందని పేర్కొన్నారు. విశ్రాంత జేడీఏ, దేశీ శిక్షణ సమన్వయకర్త జయచంద్ర మాట్లాడుతూ...నేడున్న పరిస్థితుల్లో సంప్రదాయ పంటలు కలసి రావడం లేదని, ఉద్యాన పంటల సాగుపై రైతులు దృష్టి సారించాలని తెలిపారు.ఉద్యాన పంటల్లో పూలతోటల సాగు బాగా కలసి వస్తుందని తెలిపారు. పూల సాగును ప్రోత్సహించేందుకు ప్రభుత్వం రాయితీలు కూడా ఇస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో వివిధ మండలాలకు చెందిన ఇన్‌పుట్ డీలర్లు పాల్గొన్నారు.



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఉద్యాన అధికారి మధన్‌మోహన్‌గౌడు

## స్పోర్ట్స్

### విద్యార్థి దశ నుంచే క్రీడల్లో రాణించాలి



తైక్వాండో పోటీలను ప్రారంభిస్తున్న మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ శమంతకమణి

**కర్నూలు (టౌన్):** విద్యార్థి దశ నుంచే క్రీడల్లో రాణించాలని కర్నూలు మార్కెట్ యార్డు మాజీ చైర్‌పర్సన్ శమంతకమణి అన్నారు. ఆదివారం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియంలో ఒలింపిక్ డేను పురస్కరించుకొని జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో తైక్వాండో పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను ఆమె ప్రారంభించి మాట్లాడుతూ తైక్వాండో క్రీడ వల్ల శారీరక ధృఢత్వం, మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. క్రీడలకు తన వంతుగా సహకారం అందిస్తానన్నారు. కార్యక్రమంలో జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతిరావు, జిల్లా ఒలింపిక్ సంఘం ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, న్యాయవాది శ్రీధర్, యుఆర్‌బీ ఫౌండేషన్ అధ్యక్షుడు ఊట్ల రమేష్‌బాబు, క్రైడాయి అధ్యక్షుడు సాయిరాం రెడ్డి, బ్రిజేష్ సింగ్ మాస్టర్లు సతీష్‌కుమార్ పాల్గొన్నారు.

**శారీరక మానసిక ఆరోగ్యానికి క్రీడలు అవసరం**

**– గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు డాక్టర్ శంకర్ శర్మ**

**కర్నూలు (టౌన్):** శారీరక మానసిక ఆరోగ్యానికి క్రీడలు అవసరమని గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు డాక్టర్ శంకర్ శర్మ అన్నారు. ఆదివారం స్థానిక లక్ష్మీనరసింహస్వామి దేవాలయం సమావేశ హాలులో మార్షల్ ఆర్ట్స్ శిక్షణ శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ విద్యార్థినీ, విద్యార్థులు తప్పని సరిగా క్రీడలను ఎంచుకోవాలన్నారు. తద్వారా చదువులోనూ రాణిస్తారన్నారు. కార్యక్రమంలో కరాటే శిక్షకులు వెంకటేష్ పాల్గొన్నారు.